క్లుప్తంగా

జెడ్పీ చైర్మన్ ప్రత్యేక పూజలు



ఆలయంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు

రాజాం: మండలంలోని మొగిలివలసలో నూతనంగా నిర్మించిన కాశీ విశ్వేశ్వర ఆలయంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జెడ్పీ చైర్మన్‌ను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, పొట్నూరు లక్ష్మణరావు, వావిలపల్లి జగన్‌మోహనరావు, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, అంతకాపల్లి ఎంపీటీసీ సభ్యుడు బౌరోతు కాంతారావు, మజ్జి హరి, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ కాశీవిశ్వనాథరావు

రేగిడి: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు సిబ్బందికి సూచించారు. అంబఖండి 1, 2 సచివాలయాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిబ్బంది సమయపాలన పాటించాలని, బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు.

బకాయి జీతాలు చెల్లించాలి



ధర్నా నిర్వహిస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది

రాజాం సిటీ: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డులకు పెండింగ్ జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకుడు నాగభూషణం కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రి వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చిన జీఓ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దాలయ్య, వరలక్ష్మి, కూర్మయ్య, కొండలరావు, సుశీల, రాము, మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం



ఎమ్మెల్సీ కార్యాలయం ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

రాజాం సిటీ: పాలకొండ రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాలయాన్ని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీబరిలో వైఎస్సార్‌సీపీ తరఫున నిలిచిన సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, సుబ్రహ్మణ్యం శ్రీనివాస్, రాజాం టౌన్, రూరల్ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్ మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన



ఓటు ఎలా వేయాలో సూచిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వద్ద అధికారులు

తెర్లాం: ఈ నెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మండల పరిధిలోని పట్టభద్రులంతా ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఓటు హక్కు వినియోగంపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని శనివారం ఆయన ఆవిష్కరించారు. ఓటు సరైన పద్ధతిలో వేయకపోతే అది చెల్లుబాటు కాకుండా రద్దవుతుందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు ఎలా వేయాలో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆయనతోపాటు డిప్యూటీ తహసీల్దార్ జి.సత్యనారాయణ, సీఎస్‌డీటీ జి.భాస్కరరావు, ఆర్‌ఐ సీడీటీ రవికిరణ్ ఉన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి పట్టం కట్టండి

- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



తెర్లాం: తెర్లాంలో సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి



మెంటాడ: సుధాకర్‌కు మద్దతుగా గుర్లలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ నాయుడు



రాజాం: ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు



రాజాం: హాజరైన ఐటీ కళాశాల అధ్యాపకులు



బొబ్బిలి రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు



బాడంగి: ముగడలో పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు



రేగిడి : వన్నలిలో ప్రచారం నిర్వహిస్తున్న వైస్ ఎంపీపీ, తదితరులు

రాజాం సిటీ: ఉత్తరాంధ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్న వైఎస్సార్‌సీపీకే పట్టభద్రులు పట్టం కట్టాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. శనివారం స్థానిక జీఎంఆర్ ఐటీ కళాశాల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తున్నారని గుర్తు చేశారు. వెనుకబాటు తనానికి గురైన ఉత్తరాంధ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి కంకణం కట్టుకున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే విశాఖపట్టణాన్ని పరిపాలనా రాజధానిగా ప్రకటించారన్నారు. ఆయనకు మద్దతు తెలియజేయాలంటే ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో ఉన్న సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ, సీతంరాజు విజయమే అందరి లక్ష్యం కావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్, జీఎంఆర్ పీఏ ఆర్.అన్నంనాయుడు, ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ గిరీష్, అధ్యాపకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యం..

రేగిడి: సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యం ఓటు వేయాలని వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ వావిలపల్లి జగన్‌మోహన్‌రావు కోరారు. మండలంలోని వన్నలి, సోమరాజుపేట, వావిలవలస, తాటిపాడు, తదితర గ్రామాల్లో సీతంరాజుకు మద్దతుగా ప్రచారం చేశారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి..

బొబ్బిలి రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ పరిశీలకుడు, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ నాయకులు, కన్వీనర్లు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రచారం, ఓటర్ల స్పందనపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పట్టభద్ర ఓటరు జాబితాలో ఉన్న ప్రతి ఒక్కరినీ నేరుగా కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని సూచించారు. ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని దీటుగా తిప్పికొట్టాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సావు మురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, ఆర్థిక సంఘ మాజీ సభ్యుడు తూముల భాస్కరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటి గోపాలరావు, శంబంగి వేణుగోపాలనాయుడు, పలువురు జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జేసీఎస్ కన్వీనర్లు పాల్గొన్నారు. అలాగే బాడంగి, తెర్లాం, మెంటాడ మండలాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు.

సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం కండి



అధికారులుతో సమీక్షిస్తున్న ప్రత్యేకాధికారి సుధాకర్

రాజాం: పట్టణంతో పాటు మండలంలో జగనన్న కాలనీల్లో సామూహిక గృహ ప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి సుధాకర్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాజాం మండలంతో పాటు పట్టణ పరిధిలోని పలు శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్మాణాలు వేగవంతం చేసేలా లబ్ధిదారులను చైతన్యపరచాలని సూచించారు. అనంతరం పలు సంక్షేమ పథకాలు అమలుపై ఆరా తీశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, ఎంపీడీఓ బాసూరి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: ఈనెల 22న ఉగాది రోజున చేపట్టనున్న సామూహిక గృహప్రవేశాలకు హౌసింగ్ లబ్ధిదారులంతా సిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ అల్లు భాస్కరరావు సూచించారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని ఎం.బూర్జవలస జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. చివరిదశలో ఉన్న పనులను వెంటనే పూర్తిచేయాలని లబ్ధిదారులకు సూచించారు. హౌసింగ్ ఏఈ డి.సింహాచలం ఉన్నారు.

– బాడంగి: మండలంలోని పెదపల్లి గ్రామంలో హౌసింగ్ ఏఈ ఎస్.సత్యం ఆధ్వర్యంలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. గృహ నిర్మాణశాఖ అధికారులు జగనన్న కాలనీలో పర్యటించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుని నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఉగాది నాడు చేపట్టే సామూహిక గృహప్రవేశాలకు సిద్ధంగా ఉండాలని కోరారు. ఎంపీడీఓ అక్కారావు, ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాసరావు, ఏపీఎం భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

సూఫీ ఉత్సవంలో ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి రూరల్: విజయనగరం బాబామెట్టలో నిర్వహించిన హజరత్ షరీఫ్ అవుతుల్లా ఖాదర్‌వలీ బాబా 64వ సూఫీ సుగంధ మహోత్సవాల్లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు శనివారం పాల్గొన్నారు. బాబా ఆశీర్వాదం తీసుకుని, ఛాదర్‌ను సమర్పించారు. ఖాదర్‌వలీ బాబా దైవస్వరూపులని ఎమ్మెల్యే కొనియాడారు.



చాదర్‌ను సమర్పించిన ఎమ్మెల్యే శంబంగి

బాల్య వివాహాలు అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రఘునాథాచారి

సంతకవిటి: గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి బాల్య వివాహాలు అరికట్టాలని ఎంపీడీఓ ఎస్. రఘునాథాచారి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సహేలి, సఖి గ్రూపుల ద్వారా సేవలందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి పౌష్టికాహారం అందించాలన్నారు. అలాగే డ్రాపౌట్స్‌ను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.సులోచనారాణి, మెడికల్‌ఆఫీసర్ వెంకటేశ్వరరావు, హెచ్‌సీ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డులున్న వారందరికీ పని

రేగిడి: ఉపాధి జాబ్‌కార్డులున్న వారందరికీ పనులు కల్పిస్తామని ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు అన్నారు. మండలంలోని ఉంగరాడ, అంబఖండి, సోమరాజుపేట గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఉపాధి వేతనదారులు రెండుపూటలా పనులు చేసేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ హరనాథరావు, ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

పేదల పొట్టకొడతారా?



ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

బొబ్బిలి: పట్టణంలో ఇందిరమ్మకాలనీలో పేదల ఇళ్లు జేసీబీలతో కూలగొట్టి పేదల పొట్టకొడతారా అని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ప్రశ్నించారు. సీపీఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం ఆందోళన చేపట్టారు. ఇందిరమ్మకాలనీ, అమ్మిగారి కోనేటిగట్టు, గెస్ట్‌హౌస్ కాలనీలో పలువురు ఆక్రమణదారులను వదిలేసి, పేదల ఇళ్లు కూల్చేయడం ఏమిటని ప్రశ్నించారు. బాధితులకు న్యాయం చేసి, ఆక్రమణలు తొలగించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కోట అప్పన్న, మునకాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని

రామభద్రపురం: జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పిస్తామని ఏపీడీ జనార్దనరావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు పూటలా పనులు చేయడంతో పాటు ఇచ్చిన కొలతలు పూర్తిచేసినట్లయితే రోజుకు రూ.245 వేతనం లభిస్తుందని వేతనదారులతో అన్నారు. పని కావాలని డిమాండ్ పెట్టిన తర్వాత పనికి రాకపోతే 100 పనిదినాల్లో వారం రోజులు పోతాయన్నారు. ఆయన వెంట ఏపీఓ సుశీల ఉన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు

బొబ్బిలి రూరల్: మండలంలో పిరిడిలో శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. సీజనల్‌గా పశువుల్లో సంక్రమించే వ్యాధులు, వాటి నివారణ చర్యలను డాక్టర్ అనిత పాడిరైతులకు వివరించారు. రైతులు తమ వద్ద ఉన్న పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలని కోరారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

బొబ్బిలి రూరల్: పట్టణం, మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్లకు ఓటరు స్లిప్పులు శనివారం పంపిణీ చేసినట్లు తహసీల్దార్ ఎన్.రాజారావు తెలిపారు. వీఆర్వోలు గ్రామాల్లోని పట్టభద్ర ఓటర్లకు వాటిని పంపిణీ చేశారు. ఓటర్లంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

మొక్కల సంరక్షణ

బొబ్బిలి రూరల్: మండలంలో కృష్ణాపురంలో ఉపాధిహామీ పథకం నిధులతో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. వేతనదారులు ప్రతిరోజు మొక్కలకు నీరుపోస్తూ వాటిని సంరక్షిస్తున్నారు. మొక్కల సంరక్షణను గ్రామ సర్పంచ్ గంట సింహాచలం, ఉపాధి ఫీల్డు అసిస్టెంట్ చుక్క శ్రీదేవి నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

సంతకవిటి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని చీపురుపల్లి ఆర్‌డీఓ ఎ.అప్పారావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో ఏర్పాటు చేయాల్సిన వసతులపై సిబ్బందికి ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ సులోచనారాణి, ఎస్సై జనార్దనరావు, ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి, పాఠశాల హెచ్‌ఎం రవిశంకర్, తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

రేగిడి: మండలంలోని సంకిలిలో ఆంజనేయస్వామి ఆలయ 28వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు. స్వామివారిని తమలపాకులతో అలంకరించారు.

సన్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

రాజాం సిటీ: స్థానిక సన్ స్కూల్ విద్యార్థులు యూనిఫైడ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ వై.భారతి తెలిపారు. ఈమేరకు విద్యార్థులను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆలిండియా స్థాయిలో వి.రోషిణిశ్రీ 344వ ర్యాంకు, ఆర్.గౌతమ్ 438వ ర్యాంకు, బి.అక్షయ్ 490వ ర్యాంకులు సాధించారన్నారు.

అట్లూరిని స్ఫూర్తిగా తీసుకోవాలి



అట్లూరికి ప్రశంసాపత్రం అందజేస్తున్న రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు, తదితరులు

రాజాం సిటీ: రాజాం పట్టణానికి చెందిన అట్లూరి శేషగిరిరావును యువత స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షుడు పి.జగన్మోహనరావు అన్నారు. ఇప్పటివరకు 60 సార్లు రక్తదానం చేసిన శేషగిరిరావుకు జాతీయస్థాయి ప్రశంసాపత్రాన్ని శనివారం అందజేశారు. కార్యక్రమంలో రాజాం రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, గుణాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సింహాద్రిఅప్పన్న సంబరాలు



తప్పిటగుళ్ల నృత్య ప్రదర్శన

బాడంగి: మండల కేంద్రం బాడంగిలో సింహాద్రి అప్పన్న సంబరాలు శనివారం ఘనంగా జరిగాయి. స్థానికంగా ఉంటున్న దేవరాపల్లి, కెల్లవారి కుటుంబాలు మూడు రోజులుగా ఈ సంబరాలు చేపట్టారు. ఉదయం సింహాద్రి అప్పన్న ఉత్సవ విగ్రహానికి పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన చేశారు. ఉత్సవాల్లో భాగంగా పొందూరు మండలం రాపాకకు చెందిన జైభవానీ మేల్మేల్ శివ భాగవతం బృందంచే దశావతారాలు, శ్రీరాములోరి పందిరిపాట, స్థానిక యాదవులతో తప్పిటగుళ్ల నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆదివారం మధ్యాహ్నం అనుపోత్సవం నిర్వహించనున్నట్లు ఎంపీటీసీ దేవరాపల్లి శ్రీనివాసరావు చెప్పారు.

‘నర్తు’విజయం అందరి బాధ్యత



ఎమ్మెల్సీ బ్యాలెట్ నమూనాలు పంపిణీ చేస్తున్న ఎంపీ బెల్లాన తదితరులు

- ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: స్థానిక సంస్థల కోటాలో వైఎస్సార్‌సీపీ తరఫున ఉమ్మడి శ్రీకాకుళం ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిలిచిన నర్తు రామారావును గెలిపించుకునే బాధ్యత అందరిపై ఉందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. శనివారం స్థానిక వేంకటేశ్వర కల్యాణ మంటపంలో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు చెందిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పదవుల విషయంలో సామాజిక న్యాయం పాటిస్తున్నారని చెప్పారు. వెనుకబడినవర్గాలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో బీసీ వర్గానికి చెందిన నర్తును గెలిపించుకోవాలన్నారు. రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ, అందరిలో కలివిడిగా తిరిగే నర్తు రామారావుకు ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వడం శుభపరిణామమని తెలిపారు. ఈనెల 13న పాలకొండ డివిజన్ కేంద్రంలో ఓటింగ్ ఉంటుందని, నర్తుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఓటు వేసే విధానాన్ని ఎంపీటీసీ సభ్యులకు వివరించారు. అంతకుముందు అభ్యర్థి నర్తు రామారావు ఎన్నికల నమూనా బ్యాలెట్ పత్రాలను ఎంపీటీసీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో రాజాం ఎంపీపీ లావేటి సులోచన, జెడ్పీటీసీ సభ్యుడు బండి నరసింహులు, వంగర ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, రేగిడి వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్ మోహన్‌రావు, పార్టీ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, కరణం సుదర్శనరావు, రాజాం, వంగర సచివాలయ కన్వీనర్లు కామోదుల శ్రీరంగనాయుడు, మరిశర్ల విజయలక్ష్మి, రాజాం వైస్ ఎంపీపీలు నక్క వర్షిణి, యాలాల సునీత, డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ నర్తు నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ రోజున పటిష్ట బందోబస్తు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ తిరుమలరావు

తెర్లాం: ఈ నెల 13న జరిగే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ డోల రాజేశ్వరరావుతో కలిసి శనివారం తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉన్న వసతులను హెచ్‌ఎం పాపారావును అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు సీఐ తెలిపారు. పోలింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని తహసీల్దార్ చెప్పారు. వారి వెంట తెర్లాం ఎస్సై ఆర్.రమేష్, హెచ్‌సీ రాజు ఉన్నారు.

ఇంటింటికీ తాగునీరు అందించడమే లక్ష్యం

- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.ఉమాశంకర్



రామభద్రపురం ఉన్నత పాఠశాల పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ ఉమాశంకర్

రామభద్రపురం: జలజీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి సురక్షితమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, ఎమ్మెల్సీ ఎన్నికల జోనల్ అధికారి బి.ఉమాశంకర్ అన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ను శనివారం ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉన్న వసతులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే వేసవి దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జల్‌జీవన్ మిషన్ నిధులతో ఇంటింటికీ తాగునీటి కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో తొలి విడత పనులు పూర్తయ్యాయని, రెండో విడతగా మరికొన్ని గ్రామాల్లో పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే క్రాష్ ప్రోగ్రాం కింద గ్రామాల్లో పాడైన తాగునీటి బోర్లకు మరమ్మతులు చేపడుతున్నామన్నారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఏర్పడితే టోల్ ఫ్రీ నంబర్ 9100120711కు సంప్రదించాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ భానుప్రకాష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

కిశోరీ బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



మెంటాడ: మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు

మెంటాడ: కిశోరీ బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో శనివారం సఖి గ్రూపులతో సమావేశం నిర్వహించారు. కిశోరీ బాలికల విద్య, ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. వారికి ఉచితంగా న్యాప్‌కిన్లు, పౌష్టికాహారం అందిస్తోందని తెలిపారు. సఖి గ్రూపులు గ్రామాల్లో బాల్యవివాహాల నిర్మూలనకు, బాలికల విద్యను ప్రోత్సహించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తివిక్రమ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొన్నారు.

బాల్యవివాహాలు అరికట్టడమే ధ్యేయం

రామభద్రపురం: బాల్యవివాహాలు అరికట్టడమే ప్రభుత్వ ధ్యేయని ఎంపీడీఓ రమామణి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం వైద్యాధికారులు, ఐసీడీఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంరక్షణ పోలీసులు, ఆశా వర్కర్లతో ‘సఖీ’ సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలు వల్ల కలిగే నష్టాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఏఎల్‌జీ శిరీష, ఎంఈఓ తిరుమలప్రసాద్, ఏపీఎం జి.వెంకటరమణ పాల్గొన్నారు.

కిశోరీ బాలికలకు అవగాహన కల్పించాలి

తెర్లాం: గ్రామాల్లోని కిశోరీ బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై, దిశ, ఫోక్సో చట్టాలపై అవగాహన కల్పించాలని ఏఎస్సై మల్లేశ్వరరావు, ఎంఈఓ జె.త్రినాథరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం ‘సఖీ’ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. గ్రామస్థాయిలో సఖీ సమావేశాలు ఏర్పాటు చేసి బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై గ్రామాల్లోని కిశోర బాలికలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని పెరుమాళి పీహెచ్‌సీ వైద్యాధికారి మాధవి, ఐసీడీఎస్ తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి సిబ్బందికి సూచించారు. సమావేశంలో వెలుగు ఏపీఎం టి.రాము, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ మహిళా పోలీసులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న దళిత సంఘాల నాయకులు

రాజాం సిటీ: పట్టణంలోని మెంటిపేట ఎస్సీ కాలనీకి చెందిన దేవులపల్లి వెంకటేష్ కుటుంబానికి న్యాయం చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మెంటిపేట ఎస్సీ కాలనీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెల్లికుల సంక్షేమ సంఘ రాష్ట్ర నాయకుడు ఇ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, వెంకటేష్ మృతిపై పోలీసుల నిర్లక్ష్య వైఖరి విడనాడాలన్నారు. మృతుని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు పరిగణలోకి తీసుకుని మెంటిపేటకు చెందిన అద్దంకి వెంకటరావు, కృష్ణ, వాసు, చిన్న, సూర్యారావు, డి.శ్రీనులతోపాటు వారి అనుచరులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వెంకటేష్ మృతి చెందినేటికి 14 రోజులైనా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. అనంతరం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు బొత్స ఏసు, సాంది గౌరీశంకర్, బంగారు శ్రీను, డి.గణేష్, మిస్కా కృష్ణయ్య, డి.రామప్పుడు, అనసూయమ్మ, తదితరులు పాల్గొన్నారు.